# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 29-09-2025 సమయం : సాయంకాలం 6 గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ విజయవాడ శ్రీ కనకదుర్గమ్మవారికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు పట్టువస్త్రాలు సమర్పించారు.
- ❖ దేశంలోని విమానాశ్రయాల్లో ప్రాధాన్యత క్రమంలో ఉడాన్ యాత్రి కెఫేలను ఏర్పాటు చేస్తున్నామని కేంద్రమంత్రి కె. రామ్మోహన్ నాయుడు తెలిపారు.
- ❖ దక్షిణ కొరియా రాజధాని సియోల్ నగరంలో రాష్ట్ర మంత్రులు పి. నారాయణ, బీ సీ జనార్దన్ రెడ్డి పర్యటిస్తున్నారు.
- ❖ ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్ మీదుగా సగటు సముద్ర మట్టానికి 900 మీటర్ల ఎత్తులో ద్రోణి కొనసాగుతోందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది.

======================

మహిళలు శక్తి స్వరూపిణులని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. విజయవాడ ఇంద్రకీలాద్రిపై శ్రీ కనకదుర్గమ్మవారి జన్మనక్షత్రమైన మూలా నక్షత్రం.. ఈరోజు కావడంతో రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... అమ్మవారి దయతో రాష్ట్రం సుభిక్షంగా ఉందన్నారు. ఆలయంలో భక్తులకు ఇబ్బందులు లేకుండా దర్శనాలు కల్పిస్తున్నామని తెలిపారు. అన్నప్రసాద భవన నిర్మాణం 6 నెలల్లో పూర్తవుతుందని, ప్రసాదం తయారీ కోసం 27 కోట్ల రూపాయలతో ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తున్నామని ముఖ్యమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 28 సెకన్లు)

======================

ఉడాన్ యాత్రి కెఫే పేరుతో విమానాశ్రయాలలో చౌక ధరలకే ఆహారాన్ని అందించే వినూత్న కార్యక్రమాన్ని కేంద్రప్రభుత్వం ప్రారంభించిందని పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. విజయవాడ

అంతర్జాతీయ విమానాశ్రయంలో ఉడాన్ యాత్రి కెఫేను ఆయన ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.... ప్రయాణికుల నుంచి లభిస్తున్న విశేష స్పందన దృష్ట్యా ఈ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా విస్తరిస్తున్నామని తెలిపారు.

(వాయిస్ 34 సెకన్లు)

=====================

దక్షిణ కొరియా రాజధాని సియోల్ నగరంలో ప్రముఖ మల్టీ నేషనల్ కంపెనీ ఎల్జీ సంస్థ ప్రధాన కార్యాలయంలో ఆ సంస్థ ప్రతినిధులతో రాష్ట్ర మంత్రుల బృందం ఈ రోజు సమావేశం అయింది. రాష్ట్రంలో పెట్టుబడుల అనుకూల వాతావరణం, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ వంటి అంశాలను ఆ సంస్థ ప్రతినిధులకు రాష్ట్ర మంత్రులు పి.నారాయణ, బీ సీ జనార్ధన్ రెడ్డి వివరించారు. అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా నవంబర్ 14, 15వ తేదీల్లో విశాఖపట్టణం నగరంలో నిర్వహించనున్న సిఐఐ భాగస్వామ్య సదస్సుకు మంత్రులు ఎల్జీ సంస్థ ప్రతినిధులను ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఆంధ్రప్రదేశ్ లో సుస్థిర ప్రభుత్వంతో అభివృద్ధి తీరుతెన్నులు, పెట్టుబడిదారులకు ఉన్న అపార అవకాశాలపై మంత్రులు వారికి వివరించారు.

=====================

మహిళ ఆరోగ్యంగా ఉన్నప్పుడే కుటుంబం మొత్తం ఆరోగ్యంగా ఉంటుందని అనకాపల్లి లోక్ సభ సభ్యులు సి.ఎం.రమేష్ తెలిపారు. అనకాపల్లిలో స్థానికంగా నిర్వహించిన "స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్" కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఆరోగ్య సేవలను ఆయన ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కుటుంబ సంక్షేమ శాఖ ద్వారా ఈ నెల 17 నుండి అక్టోబర్ 2వ తేదీ వరకు రెండు వారాల పాటు స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ ను నిర్వహిస్తున్నాయని చెప్పారు. ఈ ఆరోగ్య శిబిరాల ద్వారా 123 రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్యసహాయం అందించడం జరుగుతుందన్నారు.

=====================

దేశంలో గత 11 సంవత్సరాలుగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అనేక రంగాలలో విశేష అభివృద్ధిని సాధిస్తోంది. ముఖ్యంగా సుపరిపాలనకు అధిక ప్రాధాన్యమిస్తూ చేపడుతున్న కార్యక్రమాలు దేశాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నాయి. "సేవా పర్వ్" పేరుతో వాటిపై ఆకాశవాణి విశాఖపట్టణం ప్రాంతీయ వార్తా విభాగం ప్రత్యేక కథనాలను అందిస్తోంది. అందులో భాగంగా అటల్ పెన్షన్ యోజనపై ఒక కథనాన్ని ఇప్పుడు విందాం..

(వాయిస్ 106 సెకన్లు)

=====================

జిల్లాలో "సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్"పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కాకినాడ జిల్లా సంయుక్త కలెక్టర్ రాహుల్ మీనా అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలో జిల్లా, డివిజన్ స్థాయి అధికారులతో ఈ రోజు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జిల్లా, నియోజకవర్గం, మండల, వార్డ్ సచివాలయ స్థాయిలో జీఎస్టీ కమిటీలు ఏర్పాటు చేసి ప్రజలకు విస్తృత అవగాహన కలిగించాలని సూచించారు. ప్రతీ ప్రభుత్వ కార్యాలయంలో జీఎస్టీపై హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని సంయుక్త కలెక్టర్ పేర్కొన్నారు.

=====================

బ్రహ్మోత్సవాల నిర్వహణలో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పనితీరుని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభినందించారు. అత్యంత విశిష్టమైన శ్రీ వేంకటేశ్వర స్వామి వారి గరుడ వాహన సేవను అద్భుతంగా టీటీడీ నిర్వహించిందని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ముఖ్యమంత్రి ప్రశంసించారు. గరుడ వాహన సేవలో పాల్గొనేందుకు దేశ విదేశాల నుంచి తరలివచ్చిన 3 లక్షల మందికిపైగా భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించారని అన్నారు.

బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించడంలో కీలకపాత్ర పోషించి సమన్వయంతో వ్యవహరించిన టీటీడీ బోర్డుకు, దేవస్థానం అధికారులకు, ఉద్యోగులకు చంద్రబాబు నాయుడు ధన్యవాదాలు తెలిపారు.

======================

ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్ మీదుగా సగటు సముద్ర మట్టానికి 900 మీటర్ల ఎత్తులో ద్రోణి కొనసాగుతోందని అమరావతిలోని భారత వాతావరణం కేంద్రం తెలిపింది. మరిన్ని వివరాలను వాతావరణ కేంద్రం అధికారి ఎం. వెంకట్రావు తెలియజేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

======================

======================